


'2027 నాటికి మలేరియాను నిర్మూలించాలి'

విజయనగరం రింగురోడ్డు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 2027 నాటికి మలేరియా నిర్మూలన లక్ష్యంగా కృషి చేయాలని, ఇందుకోసం వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులతో బుధవారం మలేరియా నియంత్రణపై శిక్షణ ఇచ్చారు. ప్రతి రెండు వారాలకు అధికారులు గృహ సందర్శన చేపట్టాలన్నారు. ఎవరిలో అయినా మలేరియా లక్షణాలు గుర్తిస్తే రక్తపూతలు సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు.

ఎన్నాళ్లీ.. చీటింగ్!

- వందలాదిగా మోస పోతున్న జిల్లా వాసులు
- భోగాపురంలో భారీ సంఖ్యలో బాధితులు
- రూ.కోట్లలో కుచ్చుటోపీ పెట్టిన నిర్వాహకులు





● భోగాపురం మండలానికి చెందిన అప్పలనాయుడు పెట్రోల్‌బంకులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. జీతంలో కొంత మొత్తాన్ని నెలనెలా చీటీ కడుతున్నాడు. పిల్లల చదువులు, భవిష్యత్ అవసరాల కోసం అతి కష్టం మీద డబ్బులు మిగుల్చుకుని చీటీ కడుతున్నాడు. మరో రెండు నెలలు చెల్లిస్తే పాట అయిపోతుంది. ఈ సమయంలో చీటీల నిర్వాహకుడు ఉడాయించాడు. అప్పలనాయుడు లబోదిబోమంటున్నాడు.

● విజయనగరానికి చెందిన రాజులమ్మ కూలి పనులు చేస్తూ రోజువారీ కూలి డబ్బుల్లో కొంత దాచుకుని నెలవారీ చీటీ కడుతోంది. చివరిలో వచ్చే డబ్బులు అమ్మాయి పెళ్లి ఖర్చులకు సరిపోతాయని భావించింది. దాదాపు ఎనిమిది నెలలు కట్టింది. గత నెలలో చీటీల నిర్వాహకుడు ఉన్నఫలంగా పరారీ అయ్యాడు. అప్పటి నుంచి ఆమె ఆందోళన చెందుతోంది.

● రాజాంకు చెందిన వెంకటేష్ దుస్తుల వ్యాపారం చేస్తున్నాడు. ఏటా సంక్రాంతికి చీటీ పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించుకుని నెలానెలా డబ్బులు కడుతున్నాడు. పండుగకు ఎక్కువ పెట్టుబడి అసరం ఉంటుందని భావించి చీటీ కట్టాడు. కానీ సంక్రాంతికి ముందే నిర్వాహకుడు చేతులెత్తేశాడు. దీంతో వెంకటేష్‌కు ఈ ఏడాది పండుగ లేకుండా పోయింది.

భోగాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి)

పెద్ద అవసరం తీరుతుందని.. కష్ట, సుఖాల్లో డబ్బులు ఉపయోగపడతాయని భావించి కూలీలు, చిరు వ్యాపారులు, చిరుద్యోగులు జిల్లాలో చీటీ కడుతున్నారు. ఆదాయం సరిపోకపోయినా కొద్దిమొత్తం మిగుల్చుకుని ఈ విధంగా డబ్బులు ఆదా చేసుకుంటున్నారు. నిర్వాహకులు ముందు తీపి మాటలు చెప్పి కొన్ని నెలల పాటు డబ్బులు వసూలు చేశాక పెద్ద మొత్తంతో ఉన్నఫలంగా ఉడాయి స్తున్నారు. ఇంకొందరు చీటీల నుంచి వసూలయ్యే మొత్తా న్ని నెలనెలా పాట పాడిన వారికి ఇవ్వకుండా తమ వద్దే ఉంచుకుని వడ్డీ కడతామంటారు. ఆ డబ్బులను ఇతర వ్యాపారాల్లో పెడుతున్నారు. అక్కడ నష్టం వస్తే చేతులెత్తే స్తున్నారు. ఈ తరహా మోసం చేసిన అనేక మంది నేటికీ కోర్టు కేసుల్లో ఉన్నారు. అయితే కొద్దిరోజులుగా జిల్లాలో బా ధితులు ఇంతలింతలుగా ఉంటున్నారు. కొద్దిరోజుల కిందట భోగాపురం ప్రాంతంలో అత్యధికంగా చీటీల మోసాలు వెలుగులోకి వచ్చాయి. వందల మంది బాధితులుగా మిగిలారు. డబ్బులను చీటీ నిర్వాహకుల నుంచి ఏవిధంగా రాబెట్టుకోవాలోనని మథన పడుతున్నారు. భోగాపురం గ్రామంలో సుమారు 8 నుంచి 10 మంది వరకు చీటీ నిర్వాహకులున్నారు. వీరిలో కొంత మంది మహిళలు కూడా ఉన్నారు. నిర్వాహకులు చెప్పిన కల్లబొల్లి మాటలు నమ్మి చాలా మంది చీటీలు కట్టారు. పొరిగింటివారిని, ఎదురింటివారిని చూసి కూడా చీటీలు కట్టారు. భోగాపురం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 500 నుంచి 700 మంది వరకు చీటీలు కట్టారు. వాటిలో సుమారు రూ.లక్ష నుంచి రూ.25 లక్షల వరకు చీటీలు ఉన్నాయి. సుమారు రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు బాధితుల సొమ్మును ఇవ్వకుండా నిర్వాహకులు మోసం చేశారు. కొంత మంది గ్రామం విడిచి వెళ్లి పోయారు. బాధితులు తీవ్ర నిరాశలో ఉన్నారు. పెద్దమొత్తంలో పోగొట్టుకున్న వారి వేదన కు అంతు లేకుండా ఉంది. ఎలా బతకాలో తెలియడం లేదంటూ వాపోతున్నారు. ఇదే విషయమై భోగాపురం సీఐ ఎన్వీ ప్రభాకర్‌ను వివరణ కోరగా చీటీల మోసంపై భోగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై బాధితులు కేసు పెట్టారని, ఆ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

స్టేషన్‌కు క్యూ కడుతున్న బాధితులు..

భోగాపురం పోలీస్ స్టేషన్‌కు బాధితులు క్యూ కడుతున్నారు. చీటీలు కట్టి మోసపోయామని, ఆదుకోవాలని బుధవారం స్టేషన్‌ను ఆశ్రయించారు. గ్రామంలో ఓ మహిళా చీటీ నిర్వాహకురాలి తీరుపై పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినా ఫలితం కానరాకపోవడంతో బాధితులు ఆమె ఇంటికి తాళం వేశారు. తాజాగా పోలీసులను ఆశ్రయించారు.



పోలీస్‌స్టేషన్ ముందు బాధితులు

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

● మొదటి రోజు 14 మంది పరీక్షకు దూరం



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షలు(పేపర్ 1) జిల్లాలో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని రెండు కేంద్రాల్లో బుధవారం పరీక్ష జరిగింది. ఐయాన్ డిజిటల్ జోన్(గాజులరేగ)లో మొదటి షిఫ్ట్‌లో 405 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 398 హాజరయ్యారు. ఇదే కాలేజీలో రెండో షిఫ్ట్‌లో 406 మంది రాయాల్సి ఉండగా 400 మంది మాత్రమే రాశారు. ఎంవీజీఆర్‌లో రెండు షిఫ్ట్‌లు కలిసి 199 మంది హాజరు కావాల్సి ఉండగా 198 మంది రాశారు. మొత్తం రెండు కేంద్రాల్లో కలిసి 14 మంది విద్యార్థులు పరీక్షకు దూరంగా ఉన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పరీక్ష కేంద్రాలకు తోడుగా వచ్చారు.

బొబ్బిలి - రామభద్రపురం రోడ్డులో ట్రాఫిక్ జాం


4లో

బొబ్బిలి -రామభద్రపురం రాష్ట్రీయ రహదారిలో బుధవారం ఐదు గంటల పాటు వాహనదారులు అవస్థలు పడ్డారు. గొర్లె సీతారాంపురం పెట్రోలు బంకు సమీపంలో రెండు లారీలు ఢీకొని అడ్డుగా ఉండిపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. చాలా సేపటి తర్వాత లారీలను క్రేన్ సహాయంతో పక్కకు తీశారు.

కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో అపశ్రుతి

● రన్నింగ్ చేస్తూ అస్వస్థతకు గురైన అభ్యర్థి మృతి

విజయనగరం క్రైం/దత్తిరాజేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగుతున్న పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో అపశృతి చోటు చేసుకుంది. ఈ నెల 21న పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో తెల్లవారుజామున జరిగిన పీఈటీ, పీఎంటీ పరీక్షలకు దత్తిరాజేరు మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన బౌరిబిల్లి రవి(23) హాజరయ్యారు. ప్రాథమిక అర్హత పరీక్ష అయిన వెంటనే 1600 మీటర్ల పరుగులో పాల్గొని అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి చేరుకు న్నాడు. వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించాక మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం అక్కడి వైద్యుల సూచనతో విశాఖలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో రవి మృతి చెందినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరంలో చికిత్స పొందుతున్న సమయంలో రవికుమార్‌ను ఎస్పీ పరామర్శించారు.



బౌరిబిల్లి రవి (ఫైల్)

ఉద్యోగం సాధిస్తాడని కలలుగన్న తల్లిదండ్రులు

రవికి తండ్రి అప్పలరాం, తల్లి అక్కమ్మ, అన్నయ్య సతీష్‌లు ఉన్నారు. పరుగుపందెంలో ఎంపికై ఉద్యోగం సాధించి తమకు ఆసరాగా నిలుస్తాడని తల్లిదండ్రులు కలలు కన్నారు. కుమారుడిని విగత జీవిగా చూసి కన్నీటి పర్యంతమయ్యారు. చేతికందివచ్చిన కుమారుడు మృతిచెందడాన్ని వారు తట్టుకోలేకపోతున్నారు.

ముగిసిన నియామక ప్రక్రియ

విజయనగరం దాసన్నపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో జరుగుతున్న కానిస్టేబుల్స్ నియామక ప్రక్రియ బుధవారం(16వ రోజు)తో ప్రశాంతంగా ముగిసింది. గత ఏడాది డిసెంబరు 30వ తేదీ నుంచి ఈ నెల 22వ తేదీ వరకూ ఈ ప్రక్రియ కొనసాగింది. 5,687 మంది పురుష అభ్యర్థులు హాజరుకాగా 4,019 మంది తుది పరీక్షకు అర్హత సాధించారు. అలాగే 1,141 మహిళా అభ్యర్థులు హాజరుకాగా 530 మంది అర్హత సాధించారు. 22 రోజుల పాటు జరిగిన ఈ పరీక్షలను ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావులు స్వయంగా పర్యవేక్షించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా చూశారు.



చివరి రోజు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నేటి నుంచి దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలన

● 13 వైద్య బృందాలు ఏర్పాటు: కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం 36,974 వికలాంగ పింఛన్లు ఉన్నాయని, వీటిని పునఃపరిశీలించేందుకు షెడ్యూల్‌ను ఖరారు చేశామన్నారు. దివ్యాంగులు తమకు కేటాయించిన తేదీల్లో ఆయా ఆసుపత్రులకు వెళ్లి పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం జిల్లాలోని ఐదు ఆసు పత్రుల్లో మొత్తం 13 ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలి పారు. శారీరక లోపాలున్న దివ్యాంగులు ఏరియా ఆసుపత్రులు గజపతినగరం, చీపురుపల్లి, రాజాం, ఎస్.కోట, విజయనగరం మహారాజా ఆసుపత్రికి వెళ్లాలన్నారు. అంధులకోసం రాజాం జీజీహెచ్, మూగ, చెవిటి వారికోసం విజయనగరం జీజీహెచ్, మానసిక దివ్యాంగుల కోసం ఘోషా ఆసుపత్రిలో తనిఖీలు ఉంటాయన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా అందిన నోటీసుల్లో పేర్కొన్న తేదీ, సమయానికి మాత్రమే ఆయా కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు. పింఛన్లను రద్దు చేస్తారని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, జడ్పీ సీఈవో సత్యనారాయణ ఉన్నారు.

పకడ్బందీగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందరికీ ఆమోదయోగ్య మైన పద్ధతిలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. జీవో 117 ఉప సంహరణ -పాఠశాలల పునర్వ్యవ స్థీకరణ ప్రక్రి యపై ఎంఈవోలకు, పాఠశాలల క్లస్టర్ హెడ్ మాస్టర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పునర్ వ్యవస్థీకరణలో ఏ ఒక్క విద్యార్థి నష్టపోకూడని స్పష్టం చేశారు. ప్రీ ప్రైమరీ స్కూళ్ల విషయంలో ఐసీడీఎస్ సిబ్బందితో కూడా చర్చించాలన్నారు. ఈనెల 25 నాటికి అత్యంత ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు, విద్యాశాఖ ఏడీ గౌరీశంకర్ పాల్గొన్నారు.



ఎన్నాళ్లకు.. ఎన్నేళ్లకు

4లో

● తెరపైకి జిల్లా టీడీపీ కార్యాలయం
● స్థలం పరిశీలన ● వచ్చే నెలలో శంకుస్థాపన?

అమ్మా.. నువ్వు కావాలి

● ఉదయం టాటా చెప్పి.. ఇప్పుడెందుకు పలకవు
● తల్లి మృతదేహాన్ని చూసి విలపించిన పిల్లలు
● చలించిపోయిన స్థానికులు

చీపురుపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 'మా అమ్మ మాకు కావాలి.. ఉదయం బడికి వెళ్లినప్పుడు టాటా చెప్పి పంపింది. ఇప్పుడెందుకు పలకట్లేదు..' అంటూ అచేతనంగా ఉన్న తల్లి వద్ద పిల్లలిద్దరూ అడిగిన అమాయకపు ప్రశ్నను విన్నవారు, చూసిన వారు కంటతడి పెట్టారు. పట్టణంలోని రామాంజనేయకాలనీకి చెందిన వివాహిత వడ్డాది తులసి (43) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకుంది. తల్లిని ఆ స్థితిలో చూసి తట్టుకోలేక పిల్లలిద్దరూ భోరున విలపించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రామాంజయనేయ కాలనీకి చెందిన తులసి 2009లో క్షత్రియరామ్ సింగ్‌ను కులాంతర వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త రామ్‌సింగ్ ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఆమె కూడా చిన్న పాన్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తోంది. వీరి పేరున ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ.5 లక్షలు, రాజాం గ్రామశక్తి సంస్థలో రూ.1.5 లక్షల రుణాలున్నాయి. ఈ నేపథ్యంలో రుణ దాతలకు సమాధానం చెప్పలేక, వడ్డీలు చెల్లించలేక తులసి తీవ్ర మనస్తాపానికి గురైంది. భర్త రామ్‌సింగ్ డ్యూటీలో భాగంగా బయటకు వెళ్లిపోయాక బుధవారం ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ జి.శంకర రావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పిల్లలు చంద్రశేఖర్ బీంసింగ్ (7), ఇందుప్రియ (9)లను ఓదార్చడం ఎవరితరం కాలేదు. తండ్రి ఆరోగ్యం కూడా అంతంత మాత్రం కావడంతో పిల్లల భవిష్యత్తును ఎవరు తీర్చి దిద్దుతారోనని స్థానికులు ఆవేదన చెందారు.



తులసి (ఫైల్)

విద్యార్థులను మోకాళ్లపై నిల్చోబెట్టి..!

● ఉపాధ్యాయుడిని నిలదీసిన స్థానికులు


గరివిడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అర్తమూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పట్ల పాఠశాల ఉపాధ్యాయుడు ప్రవర్తించిన తీరు విమర్శలకు తావిచ్చింది. హోం వర్కును చేయనందుకు ఓ ఉపాధ్యాయుడు బుధవారం గంటలకొద్దీ పాఠశాల బయట ఎండలో మోకాళ్లపై నిల్చోబెట్టారు. దీన్ని గమనించిన స్థానికులు ఉపాధ్యాయుడుని ప్రశ్నించారు. మందలించే తీరు పద్ధతిగా ఉండాలన్నారు. ఈ విషయమై వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. విద్యార్థినులు మోకాళ్లమీద కూర్చోడానికి చాలా ఇబ్బంది పడ్డారు. విషయాన్ని ఎంఈవో పి.రామారావు వద్ద ప్రస్తావించగా తన దృష్టికి వచ్చిందని, భవిష్యత్తులో మళ్లీ ఇలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఉపాధ్యాయుడిని హెచ్చరించానని తెలిపారు.



మోకాళ్లపై విద్యార్థులు

స్వచ్ఛమైన పంటలు

- రసాయన ఎరువులకు దూరం
- సేంద్రియ విధానంతో సాగు
- ఇదీ గిరిజనం ప్రత్యేకత





నారును పరిశీలిస్తున్న రైతు



కాయగూరల తోటలో గిరిజన రైతు



ఏపుగా పెరిగిన పసుపు మొక్కలు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు తరతరాలుగా పోడు, మెట్ట వ్యవసాయమే ఆధారం. వీరు ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా వ్యవసాయం చేస్తున్నారు. తమ పంటలను అవసరానికి వినియోగించుకోవడంతో పాటు మిగిలిన పంటను అమ్ముకుంటారు. ఇవి పూర్తి స్థాయిలో సేంద్రియ పంటలే. పోడు వ్యవసాయంలో భాగంగా కొండలపై నరికిన చెట్లు ఎండిన తర్వాత కాల్చుతారు. ఆ బూడిదను ఎరువుగా వాడుతారు. ఆ భూమిలోనే కంది, మొక్కజొన్న, చోడి (రాగులు), కొర్రలు, ఓడెలు, సామలు తదితర పంటలు పండిస్తుంటారు. రసాయన ఎరువుల వినియోగానికి దూరంగా ఉంటారు. మెట్ట వ్యవసాయంలో ఆకుకూరలు, వివిధ రకాల పుష్పజాతులు పండిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో ఈ పంటలు సాగు చేస్తున్నారు. సుమారు 50 ఎకరాల్లో పసుపు పంట, 500 ఎకరాల్లో అరటి పండిస్తున్నారు. మరో వెయ్యి ఎకరాల్లో మెట్ట వ్యవసాయం చేస్తున్నారు. ఈ పంటలను కొందరు దళారులు కొనుగోలు చేసి.. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో అమ్ముతున్నారు. ఈ పంటలకు మంచి డిమాండ్ ఉంది. ఏజెన్సీ ప్రాంతంలోని వివిధ పాఠశాలల్లోనూ సేంద్రియ పద్ధతుల్లో కాయగూరలను పండిస్తున్నారు. ఈ కాయగూరలను మధ్యాహ్న భోజనాల్లో వినియోగిస్తున్నారు. వ్యవసాయ శాఖ కూడా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. ఈ పద్ధతుల్లో వ్యవసాయం చేసుకోవడానికి వీలుగా రైతులకు కురుపాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సేంద్రియ వ్యవసాయం కారణంగానే గిరిజన ప్రాంతాల పంటలను పల్లపు ప్రాంత ప్రజలు కొనుగోలు చేస్తుంటారు. ధర మార్కెట్ కన్నా కంచెం ఎక్కువైనా వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. గిరిజనులు వారపు సంతల్లో తాము పండించే అరటి, దుంపలు, కాయగూరలు, సీతాఫలాలు, నిమ్మకాయల వంటివి విక్రయిస్తుంటారు.

ప్రోత్సహిస్తున్నాం..

సేంద్రియ వ్యవసాయానికి జట్టు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. ఎరువుల తయారీ, వినియోగంపై గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

-డి.పారినాయుడు, డైరెక్టర్, జట్టు సేవా సంస్థ తోటపల్లి

శిక్షణ ఇస్తున్నాం..

గిరిజనులు సొంతంగానే సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. కాయగూరలు, పండ్ల తోటల పెంపకంలో తగిన విధంగా శిక్షణ ఇస్తున్నాం.

-షన్ముఖరావు, జిల్లా సేంద్రియ వ్యవసాయాధికారి, పార్వతీపురం

కాయగూరలు పండిస్తున్నాం..

ప్రభుత్వ ప్రోత్సాహంతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాం. ఫలితాలు బాగున్నాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా కాయగూరల పెంపకాన్ని కూడా చేపడుతున్నాం.

-డి.శంకరరావు, గిరిజన రైతు, దుడ్డుకళ్లు, గుమ్మలక్ష్మీపురం

మంచి డిమాండ్ ఉంది..

సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించే కాయగూరలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మేం ప్రతి గురువారం గుమ్మలక్ష్మీపురం సంతకు తీసుకొచ్చి.. కాయగూరలను అమ్ముతున్నాం.

-ఆరిక సోమయ్య, కప్పకళ్లు, గుమ్మలక్ష్మీపురం మండలం

జరజాపుపేటలో నాటిక పోటీలు

- ఫిబ్రవరి 20, 21, 22 తేదీల్లో నిర్వహణ



నాటిక పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చనమల్లు తదితరులు

నెల్లిమర్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాటక రంగ కళాకారుడు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, దివంగత ఆరిపాక బ్రహ్మానందం మాస్టారి పేరిట జరజాపుపేటలో ఫిబ్రవరి 20, 21, 22 తేదీల్లో నాటిక పోటీలు నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో శ్రీ ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటిక పరిషత్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ కన్వీనర్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ వెల్లడించారు. జరజాపుపేటలోని వేంకటేశ్వర మురళీకృష్ణ కల్యాణ మండపంలో పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను గ్రామ పెద్దలతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మానందం మాస్టారు నాటక రంగంలో ఎన్నో అవార్డులు సాధించి గ్రామానికి, జిల్లాకు పేరు తెచ్చారని అన్నారు.

ప్రదర్శనలు ఇలా...

ఫిబ్రవరి 20న రాత్రి 7 గంటలకు కళాంజలి (హైదరాబాద్) కళాకారులు 'రైతే రాజు' నాటికను ప్రదర్శిస్తారు. రాత్రి 8.30 గంటలకు శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ (కాకినాడ) 'ఎడారిలో వాన చినుకు', 21న రాత్రి 7 గంటలకు శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కళాకారులు 'కొత్త పరిమళం', రాత్రి 8.30 గంటలకు విజయనగరానికి చెందిన సౌజన్య కళా స్రవంతి కళాకారులు 'దేవరాగం' నాటికను ప్రదర్శిస్తారని తెలిపారు. 22న రాత్రి 7 గంటలకు చైతన్య కళాభారతి (కరీంనగర్) కళాకారులు 'చీకటి పువ్వు', రాత్రి 8.30 గంటలకు తెలుగు కళా సమితి (విశాఖపట్నం) కళాకారులు 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటికను ప్రదర్శిస్తారని వెల్లడించారు. స్థానిక వేంకటేశ్వర మురళీకృష్ణ కల్యాణ మండపం ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామ పెద్దలు అవనాపు సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, నల్లి బంగారు చంద్రశేఖర్, ఆరిపాక కృష్ణమాచారి, మిమ్స్ హెచ్‌ఆర్ జీఎం ఆరిపాక శ్రీనివాసరావు, కాళ్ల రాజశేఖర్, మన్యపురి మోహనరావు, కిల్లంపల్లి రామారావు, బోలే సత్యనారాయణ, మద్దిల శ్రీను, అవనాపు మురళీకృష్ణ, ఎడ్ల గోవిందరావు, కళాకారులు సన్యాసిరావు, సూర్యారావు, దొర పాల్గొన్నారు.



ఆరోగ్యం.. భద్రం

- వ్యాధులు విజృంభించే సీజన్
- జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పు
- ఉన్ని దుస్తులు తప్పనిసరి

కొమరాడ ఏజెన్సీలో దట్టంగా కురుస్తున్న మంచు

కొమరాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో చలి ప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. గజగజ వణికిస్తోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ఉదయం 10 గంటల వరకు ఎండ రావడం లేదు. రోజంతా చలిగా ఉంటోంది. చలి తీవ్రతకు చిన్నారులు, వృద్ధులు, గుండె, మధుమేహం, రక్తపోటు బాధితులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. దీంతో ఈ కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఇవీ సమస్యలు..

చలికాలంలో ప్రధానంగా జలుబు, గొంతు నొప్పితో చిన్నారులు, వృద్ధులు బాధ పడుతుంటారు. వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. పెదవులు పగిలి రక్తస్రావం జరుగుతుంది. చర్మం పొడి బారుతుంది. దీనివల్ల దురద ఎక్కువగా ఉంటుంది. 50 ఏళ్ల పైబడిన వారిలో కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. చల్లటి నీళ్లతో స్నానాలు చేయడం, మంచులో ప్రయాణం చేయడంతో పాటు ఆస్తమా బాధితులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, జలుబు వంటివి తరచూ వస్తాయి. గుండె సంబంధిత వ్యాధులు, రక్తపోటు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడతారని అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

శీతాకాలంలో మంచులో తడవడం, చల్లటి గాలిలో తిరగడం చేయకూడదు. చిన్న పిల్లలను చలి గాలుల్లో ఆడుకోనివ్వరాదు. మంకీ టోపీలు, గ్లౌజులు, మాస్కులు వంటివి ధరించాలి. ఒకే చోట ఎక్కువ సమయం కూర్చొని ఉండకూడదు. చలి, మంచు తగలకుండా ఇంట్లోనే నడవాలి. జలుబు ఎక్కువగా ఉంటే ఆవిరి పట్టాలి. గొంతు సమస్య ఉన్నవారు ఒక గ్లాసు వేడి నీటిలో చెంచా ఉప్పు వేసుకుని పుక్కిలించాలి. ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతి రుమాలను తరచూ మారుస్తూ ఉండాలి. చిన్న పిల్లలకు ముక్కు మూసుకుపోయి శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటే నాసికా రంధ్రాల్లో నాజల్ డ్రాప్స్ గానీ, ఉప్పు నీటి చుక్కలు గానీ వేయాలి. వేడి నీళ్లు తాగాలి. నిల్వ పదార్థాలను తినరాదు. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. పెదవులు పగిలిపోకుండా గ్లిజరిన్ కలిగిన లిప్‌బామ్‌లను, వెన్న, కొబ్బరి నూనె పూసుకోవాలి. రాత్రి సమయంలో పూసుకుంటే మంచిది. వాకింగ్ చేసేవారు విధిగా గ్లౌజులు, మాస్కులు, ఉన్ని దుస్తులు వేసుకోవాలి. ఆస్తమా ఉన్నవారు చల్లని గాలులకు పూర్తిగా దూరంగా ఉండాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఉన్ని దుస్తులు ధరించి ప్రయాణం చేయాలి. అన్ని జాగ్రత్తలు తీసుకుంటేనే ఈ శీతాకాలంలో ఇబ్బందుల నుంచి గట్టెక్కగలమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

గర్భిణులు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలి..

శీతాకాలంలో గర్భిణులు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలి. ఉదయం పూట ఎండలో ఉండాలి. ఉన్ని దుస్తులతో పాటు ముఖానికి చలి తగలకుండా చూసుకోవాలి. చిన్న పిల్లల్లో ఆస్తమా ఉంటే ఇబ్బందులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గుండె, చక్కెర వ్యాధి, ఆస్తమా ఉన్నవారు శీతాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

-డాక్టర్ తెర్లి జగన్మోహన్‌రావు, జిల్లా ప్రోగ్రాం అధికారి, పార్వతీపురం

ఎన్నాళ్లకు.. ఎన్నేళ్లకు!

- తెరపైకి జిల్లా టీడీపీ కార్యాలయం
- స్థలం పరిశీలన
- వచ్చే నెలలో శంకుస్థాపన?



అశోక్ నివాసం

విజయనగరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి జిల్లా కేంద్రంలో త్వరలో సొంత కార్యాలయం ఏర్పాటు కానుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ ప్రతిపాదన ఉన్నా... కార్యరూపం దాల్చలేదు. టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు ఇంటినే కార్యాలయంగా వినియోగిస్తున్నారు. ఆ చెట్ల కిందనే నాయకులు సేద తీరుతూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో కూడా జిల్లాకు అదే కార్యాలయం. 2014లో రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర నాయకత్వం నిర్దేశించింది. ఈ క్రమంలో విజయనగరంలో కూడా పార్టీ కార్యాలయానికి సంబంధించి స్థల పరిశీలన, కౌన్సిల్ ఆమోదం చకచకా జరిగిపోయాయి. అయితే ఐదేళ్ల కాలంలో ఇదిగో.. అదిగో అన్నారు తప్ప కార్యాలయం అందుబాటులోకి రాలేదు. 2019 ఎన్నికల్లో టీడీపీ పరాజయంతో చేసేది లేక.. తిరిగి అశోక్ గజపతిరాజు నివాసాన్నే కార్యాలయంగా వినియోగించారు. ఇప్పటి వరకూ దానినే వినియోగిస్తున్నారు. తన నివాసంలో రెండు గదులను కార్యాలయ నిర్వహణకు అశోక్ కేటాయించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆమె గెలిచిన తరువాత కూడా పార్టీ కార్యాలయంగా అశోక్ నివాసమే ఉంది. రాష్ట్ర పార్టీ గత నెల రోజుల నుంచి కార్యాలయం విషయమై దృష్టి సారించింది. జిల్లా పార్టీకి దిశా నిర్దేశం చేసింది. దీంతో ప్రస్తుతం మెడికల్ కళాశాలకు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. ఆ స్థలానికి సంబంధించిన ప్రతిపాదనలు రాష్ట్ర పార్టీకి చేరాయి. రాష్ట్ర పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తరువాత దీనిపై నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. ప్రభుత్వానికి దీన్ని పంపించారు. ఈ విషయమై ఈ నెల 21న జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి అనిత, మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు సమావేశంలో ప్రకటించారు. కార్యాలయ నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

శంకుస్థాపనకు ఏర్పాట్లు..

ఇప్పటికే గుర్తించిన స్థలంలో శరవేగంగా కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టాలని రాష్ట్ర పార్టీ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఫిబ్రవరి నెలలో శంకుస్థాపనకు అనువైన ముహూర్తాలు ఉండడంతో మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, జిల్లా ముఖ్య నాయకులంతా పాల్గొని, కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రెండెకరాల స్థలంలో రాష్ట్ర పార్టీ రూపొందించిన ప్రత్యేక డిజైన్‌తో, అధునాతన సౌకర్యాలతో ఈ కార్యాలయం రూపుదిద్దుకోనుంది. అక్కడ ప్రతి రోజు ఎవరో ఒకరు అందుబాటులో ఉండి... ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు కార్యకర్తలను కలుసుకోవలసి ఉంటుంది. జిల్లా పార్టీ అధ్యక్షుడికి ప్రత్యేక చాంబర్, సమావేశ హాలు, ప్రెస్ కాన్ఫరెన్స్‌కు ఓ హాలు... తదితర సౌకర్యాలతో దీన్ని నిర్మించి.. రాష్ట్ర పార్టీ కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు.

రెండు లారీలు ఢీ

- భారీగా ట్రాఫిక్ జామ్



క్రేన్‌తో లారీని తొలగిస్తున్న దృశ్యం

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, జనవరి 22: బొబ్బిలి- రామభద్రపురం రాష్ట్రీయ రహదారిలో గొర్లె సీతారాంపురం పెట్రోలు బంకు సమీపంలో బుధవారం తెల్లవారు జామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి అపాయం జరుగలేదు. రాయ్‌పూర్ నుంచి విశాఖకు, విశాఖ నుంచి జార్సగుడాకు వెళుతున్న లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు లారీలు రోడ్డుపై ఘటనా స్థలంలో ఉండిపోవడంతో బొబ్బిలి-రామభద్రపురం రహదారిలో నడిచే వందలాది వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు ఐదు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పారాది వంతెన దగ్గర దీని ప్రభావం చాలా ఎక్కువగా కనిపించింది. వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరో పక్క శిథిలమైన పాత వంతెనపై భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. వేగావతి నదిపై వేసిన చిన్నపాటి డైవర్షన్ రోడ్డుపై నుంచి రెండు పక్కల వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో అనేక వాహనాలను బొబ్బిలి నుంచి తెర్లాం రోడ్డుకు, రామభద్రపురం నుంచి రాజాం రోడ్డుకు మళ్లించారు. బొబ్బిలి నుంచి పోలీసులు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న రెండు లారీలను క్రేన్‌తో పక్కకు తొలగించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగనందున కేసు నమోదు చేయలేదని ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. తాము ట్రాఫిక్‌ను పునరుద్ధరించామని చెప్పారు.



బారులు తీరిన వాహనాలు

నేడు నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు

- రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు

విజయనగరం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను విజయనగరం జిల్లా పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ నేతలు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో ఏర్పాట్లు చేస్తున్నారు. లోకేశ్ 41వ సంవత్సరంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో 41 కిలోల కేక్‌ను కట్ చేసేందుకు నిర్ణయించారు. భారీ ఎత్తున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం విజయనగరం నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది రక్తదాతలు వచ్చే విధంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రయత్నిస్తున్నారు. విజయనగరంలోని 50 డివిజన్లలో ఒక్కొక్క డివిజన్ నుంచి ఐదుగురికి తగ్గకుండా రక్తదాతలను తీసుకువచ్చే బాధ్యతను క్షేత్ర స్థాయి కమిటీలకు అప్పగించారు. మండలంలోని 21 గ్రామాల నుంచి గ్రామానికి ఐదుగురికి తగ్గకుండా రావాలని నిర్ణయించారు. 500 యూనిట్లకు తగ్గకుండా రక్తాన్ని సేకరించి, జిల్లా రక్తనిధికి అందించాలని యోచిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. రక్తదానంతో పాటు, వివిధ కార్యక్రమాల ఏర్పాట్లను అశోక్ బంగ్లాలో అదితి పర్యవేక్షించారు.



నారా లోకేశ్ పుట్టిన రోజు ఫ్లెక్సీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్‌ఆర్‌సీ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈనెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

దరఖాస్తులను పరిష్కరించండి

విజయనగరం రింగురోడ్డు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న లే-అవుట్ భవన క్రమబద్ధీకరణ దరఖాస్తుల సమస్యలను మార్చి 31 లోపు పరిష్కరించాలని సిబ్బందికి అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో సచివాలయ ప్రణాళిక కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ లే-అవుట్ క్రమబద్ధీకరణ కోసం 607 దరఖాస్తులు రాగా, వాటిలో 462 దరఖాస్తులకు అనుమతి లభించిందన్నారు. ఇంకా 165 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పరిష్కరించేందుకు దరఖాస్తుదారులకు, లైసెన్సు, టెక్నికల్ సిబ్బందితో సంప్రదింపులు చేపట్టి పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. సమావేశంలో టీపీవో అప్పలరాజు, టీపీఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.

భాషా పరీక్షలపై అవగాహన

లక్కవరపుకోట (కొత్తవలస), జనవరి 22(ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు పరీక్షలపై విద్యార్థులకు బుధవారం వియ్యంపేటలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో అవగాహన కల్పించారు. విజయనగరం, మన్యం జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ టి.జయశ్రీ ఆధ్వర్యంలో పలువురు విద్యావేత్తలు పరీక్షలపై వివరించారు.

ధాన్యం కొనుగోలుపై విచారణ జరిపించండి

జామి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోట్లపల్లి సచివాలయం పరిధిలో జరిగిన ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ విచారణ జరిపించాలని హెచ్‌ఆర్‌సీఐ విజయనగరం జిల్లా ఉప కార్యదర్శి జన్నెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోట్లపల్లి రైతులు పంట నూర్పులు చేయకుండానే, ధాన్య అమ్మకుండా వారి ఖాతాల్లో డబ్బులు పడ్డాయని కొందరు దళారులు... రైతులకు మాయమాటలు చెప్పారన్నారు. వారి పట్టా పుస్తకాలు, ఆధార్ కార్డులు సేకరించి రూ.లక్షల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఇందులో వ్యవసాయశాఖ అధికారుల పాత్రపైనా దర్యాప్తు చేయాలని కోరారు. ఇదే విషయం మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేసిన స్పందించలేదన్నారు. త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రైతులను మోసగించిన దళారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలకృష్ణ కోరారు.

ప్రతీ ఇంటికి తాగునీరు

లక్కవరపుకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండలంలోని ఖాసాపేట, ముత్యాలమ్మపాలెం, రంగాపురంల్లో ఇంటింటి కొళాయి కనెక్షన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వరరావు, కొట్యాడ ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పైడిరాజు, ఏఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్యాంకులు శుభ్రపరచండి

రాజాం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు.

లక్ష్మీపురంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

రేగిడి, జవవరి 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం దళితవాడలో బుధవారం డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గ్రామస్థులు ఆవిష్కరించారు. సర్పంచ్ కెంబూరు తేజో వెంకటేశ్వరరావు సహకారంతో విగ్రహం ఏర్పాటైంది. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ సభ్యురాలి ప్రతినిధి అప్పలనాయుడు, గ్రామపెద్దలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, గోవిందరావు, యూత్ ప్రతినిధులు సురేష్, కిశోర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై సస్యరక్షణ

గజపతినగరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగులో పురుగు, తెగుళ్ల నివారణపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్.ధనలక్ష్మి రైతులకు సూచించారు. బుధవారం తుమ్మికాపల్లిలో ఆమె మొక్కజొన్న పంటను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ మార్పు

● ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట తప్పిన ట్రాఫిక్ ఇబ్బందులు



ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

విజయనగరం క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ట్రాఫిక్ సమస్యకు చెక్ పడింది. ఆటోవాలాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని భావించిన పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. ఆటో స్టాండ్‌ను ఆ సమీపంలోని ప్రాంతానికి తరలించడంతో ట్రాఫిక్ ఇబ్బందులకు తెరపడినట్టయింది. వివరాల్లోకి వెళితే.. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట నిత్యం రద్దీగా ఉంటోంది. ఆటోలు అక్కడే నిలుపుతుండటంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్య ఇక్కడ సర్వసాధారణంగా మారింది. ప్రధానంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేట్, అవుట్ గేట్‌ల ఎదుట ఆటోలను నిలపడం, అక్కడే ప్రయాణికులను ఎక్కిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. దీనిపై ట్రాఫిక్ పోలీసులు ఎన్నో పర్యాయాలు చర్యలు చేపట్టారు. అయితే తాత్కాలికమే అయ్యాయి. ట్రాఫిక్ సమస్య యథావిధిగా మారడం పోలీసులకు శిరోభారంగా పరిణమించింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ట్రాఫిక్ పోలీసులు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. తొలుత ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఉన్న ఆటోస్టాండ్ తరలింపుపై ట్రాఫిక్ సీఐ సూరినాయుడు దృష్టి కేంద్రీకరించారు. ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆటో స్టాండ్‌ను శాశ్వతంగా పక్కకు మార్పు చేయాలని చెప్పారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ట్రాఫిక్‌కు అంతరాయం తొలగింది. బస్సులు, ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యంగా మారింది.

కొనసాగుతున్న సర్వేయర్ల నిరసన

● ఎమ్మెల్యేలకు వినతిపత్రాల అందజేత



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సర్వే శాఖ ఉద్యోగులు

విజయనగరం, కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) కలెక్టర్, సర్వే శాఖలోని గ్రామ, మండల, డివిజన్ స్థాయి ఉద్యోగులు మధ్య నెలకొన్న సమస్య ఇంకా సమసిపోలేదు. దీంతో ఇది జిల్లావ్యాప్తంగా హట్ టాపిక్‌గా మారింది. జిల్లావ్యాప్తంగా సర్వేశాఖలో పనిచేస్తున్న 542 మంది ఉద్యోగులు క్యాజువల్ లీవ్ పెట్టి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవిలకు సర్వేయర్లు వినతిపత్రాలు బుధవారం అందజేశారు. ఈనెల 18న జరిగిన సమీ క్ష సమావేశంలో కలెక్టర్, జేసీలు తమను కించి పరిచేలా మాట్లాడారని, ఆ మాటలు వెనక్కి తీసుకోవాలని సర్వేయర్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్వే శాఖ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరావు చౌదరి సరెండర్‌ను వెనక్కి తీసుకోవాలని వారు కోరారు. ఇప్పటి వరకూ ఇచ్చిన మెమోలు, షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు మేరకు రీసర్వే గ్రామసభల్లో వచ్చిన పీజీఆర్‌ఎస్ వినతులు పరిష్కారానికి అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు సర్వే అసోసియేషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చిరంజీవిరావు బుధవారం రాత్రి జిల్లాలో ఉన్న సమస్యపై కలెక్టర్ అంబేడ్కర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యను కలెక్టరుకు వివరించారు. దీనిపై కలెక్టర్ నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదని ఉద్యోగులు అంటున్నారు.

24 నుంచి వారధి యువ సదస్సు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రామనారాయణంలో ఈనెల 24 నుంచి రెండు రోజుల పాటు వారధి-2025 యువ సదస్సును నిర్వహించ నున్నట్టు ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఐనాక్స్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజానికి అవసరమైన రామాయణంలోని వివిధ కోణాలను వ్యాసరూపంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందించనున్నామన్నారు. 26న పిల్లలు, పెద్దలు రాసిన వ్యాసాలతో కనివినీ ఎరుగని రీతిలో రామనారాయణం లోని శ్రీరామచంద్ర మూర్తికి సహస్ర నామార్చన జరగబోతుందన్నారు. రామాయణ ప్రచార మహా యజ్ఞంలో అందరూ పాల్గొనాలని కోరారు. భావితరాలకు రామాయణం ఎంత గానో అవసరమన్నారు. ఈ సందర్భంగా వారధి కరపత్రాలను ఆవిష్కరించారు.

15వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్

విజయనగరం రింగురోడ్డు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్‌లో బుధవారం కమిషనర్ పి.నల్లనయ్య పర్యటించారు. రాజారావు మేడ, ఇప్పిలి వీధి, అద్దెపల్లెవారి వీధి, కోలగటవారి వీధి, గుంటూరువారి వీధి, తెలకల వీధి, గుంపా వీధి, గౌడ వీధిల్లో అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. తెలకల వీధిలో సామాజిక మరుగుదొడ్లను త్వరగా ప్రారంభించే విధంగా చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టీపీఆర్‌వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజరు సన్యాసిరావు, డీఈ శ్రీనివాసరావు, అంజిబాబు పాల్గొన్నారు.

మార్చి 10 నుంచి కనకదుర్గమ్మ జాతర

భోగాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో గ్రామదేవత కనకదుర్గమ్మకు మార్చి 10 నుంచి 12 వరకూ ఘనంగా జాతర నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, అర్చకులు ముహూర్తం ఖరారు చేశారు. అలాగే మార్చి 9న ఆదివారం ఎల్లమ్మతల్లి జాతర నిర్వహించేందుకు పెద్దలు నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కందుల రఘుబాబు, కొమ్మూరు సుభూషణరావు, ఆళ్ల శ్రీనివాసరావు, పడాల భానుప్రకాశ్, రౌతు వాసుదేవరావు, సుందర హరీష్, అర్చకులు ఆరివిల్లి గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక

గంట్యాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం జిల్లా అంకుపాలెం గ్రామంలోని ఈనెల 25 నుంచి 27 వరకూ జరగనున్న 71వ అంతర జిల్లా స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలకు బుధవారం మధ్యాహ్నం గంట్యాడ జడ్పీ పాఠశాలలో క్రీడాకారులను ఎంపిక ప్రక్రియ జరిగింది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 64 మంది క్రీడకారులు హాజరు కాగా, 12 మంది బాలికలు, 12 మంది బాలురు ఎంపిక చేశారు.

రెండు పాఠశాలల స్థాయి పెంపు?

రాజాం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గురవాం, పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుగా విద్యాశాఖ ఉన్నతాధికారులకు మండల విద్యాశాఖ ప్రతిపాదనలు పంపింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేసే ప్రక్రియలో భాగంగా రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా మారనున్నాయి. తాజా నిబంధనల ప్రకారం 6, 7, 8 తరగతులతో నిర్వహిస్తున్న యూపీ స్కూల్స్‌లో 55-60 మధ్య విద్యార్థులు ఉంటే అలాంటి పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. రాజాంలోని రెండు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 60 మంది కన్నా ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంవ వల్ల విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలలుగా మారే అవకాశం ఉంది. రాజాం మండలంలో 12 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా మిగిలిన 10 పాఠశాలల్లో 50 మంది కన్నా తక్కువ విద్యార్థులు ఉన్నారు. దాంతో ఇక ఆయా పాఠశాలలు ప్రాథమికోన్నత హోదాను కోల్పోయి మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగనున్నాయి. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం 6, 7, 8, చదువుతున్న విద్యార్థులు సమీప ఉన్నత పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది.

వైద్య తనిఖీలకు ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోషఫ్

రాజాం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం నుంచి దివ్యాంగులకు వైద్య తనిఖీలు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జోషఫ్ బుధవారం ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడారు. రోజూ మంది ఎముకలు, నేత్ర సమస్యల దివ్యాంగులను పరిశీలించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో వారు పొందిన సదరం ధ్రువపత్రంలో అవకతవకలు ఉన్నాయనే ఆరోపణల మేరకు ప్రభుత్వం దివ్యాంగుల ధ్రువపత్రాలను పునఃపరిశీలించాలని ఆదేశించిందన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో శ్రీనివాసరావు, వైద్యులు అనిల్‌కుమార్ తదితరులున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కసరత్తు



కమిటీతో సమావేశమైన ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట (కొత్తవలస), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నివాసంలో విద్యాశాఖ కమిటీ ఆమెతో సమావేశమైంది. చీపురుపల్లి, పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో కమిటీ వేసి కొత్తవలసలో డిగ్రీ కళాశాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. 2025-26 అకడమిక్ ఇయర్ నుంచి డిగ్రీ తరగతుల నిర్వహణపై చర్చించారు. సుమారు 5 ఎకరాల్లో కళాశాల ఏర్పాటుకు సౌలభ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే. కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. భవన నిర్మాణం చేపట్టేవరకు జూనియర్ కళాశాలలో డిగ్రీ తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ఎన్నికల హామీతో పాటు అసెంబ్లీలో విద్యాశాఖామంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే చర్చించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కేశవరావు, కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

డి.కె.పర్తిలో పర్యటించిన ఆర్డీవో



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో

గంట్యాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయిర్ అవల దిగువ కొండపర్తి గ్రామాన్ని విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి బుధవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ గ్రామంలో గృహనిర్మాణ శాఖ పలువురు గిరిజనులకు ఇళ్లు మంజూరు చేసింది. అయితే ఇళ్లకు కేటాయించిన స్థలం తాటిపూడి ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలో ఉందని రెవెన్యూ అధికారులు పొజిషన్ పత్రాలు మంజూరు చేయలేదు. దీంతో గృహనిర్మాణ శాఖ అధికారులు ఇటీవల ఈ సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ కూర్మినాయుడు, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, గృహనిర్మాణ శాఖ జేఈ రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

రైతులకు న్యాయం చేయండి

శృంగవరపుకోట రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతులు నిల్వ చేసిన ధాన్యం కాలిపోవడంతో వారంతా ఆర్థికంగా చాలా నష్టపోయారని ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘం నాయకులు తహసీల్దార్ అరుణకుమారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోగాడి అప్పారావు, మద్దిల రమణ, బాధిత రైతులు ఉన్నారు.

ఆర్వోబీలోకి నీరు

● ఆపై తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు ● చీకటి పడితే రాకపోకలు సాహసమే..



ఆర్వోబీ ఎదుట వాహనాల రాకపోకలు



ఆర్వోబీలో నిలిచిన నీరు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గూడ్స్‌షెడ్‌కు వెళ్లే రహదారి ఎప్పుడూ బిజీగా ఉంటుంది. నగరంలో బిజీగా ఉండే రోడ్లలో అదొకటి. ఆ రోడ్డులో ఆర్వోబీ ఉండేది. కొత్తగా మరో ఆర్వోబీని నిర్మించారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఇక ఉండబోదని అందరూ భావించారు. అయితే అందుకు భిన్నంగా ఇక్కడ పరిస్థితి ఉంది. ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. చిన్నపాటి వర్షం పడినా ఆర్వోబీలోకి వరదనీరు చేరడం సాధారణమే అయినప్పటికీ చుట్టూ పొలాల్లోని నీరు కూడా నిత్యం ఇందులోకి చేరుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇదిలా ఉండగా.. ఆర్వోబీలో పట్టపగలు కూడా చీకటిగానే ఉంటుంది. రాత్రివేళ ఆర్వోబీలో నుంచి వెళ్లడం సాహసమే అవుతోంది. వాస్తవంగా ఆర్వోబీలో హైమాస్ట్ లైట్లు ఉండాలి. కానీ ఇక్కడ అలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో ఒకవైపు నీరు, మరోవైపు చీకటి నెలకొని ఉండటంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

క్రైం కార్నర్

నలుగురిపై అట్రాసిటీ కేసు

● అప్పు తీర్చాలని అడిగినందుకు దాడి ● ఇద్దరికి గాయాలు

బాడంగి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చాలని అడిగినందుకు కులం పేరుతో దూషించి, దాడి చేసిన ఘటనలో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ తారకేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని డొంకినవలస గ్రామానికి చెందిన వడ్డే మధు బాడంగి ఎత్తుఖాణా వద్ద పాన్‌షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. మధు వద్ద పెదపల్లి గ్రామానికి చెందిన ఆవు నరసింహరావు, ఆవు ప్రసాద్ కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకున్నారు. ఎప్పటిలాగే నరసింహరావు, ప్రసాద్.. రామభద్రపురం మండలం రొంపల్లి గ్రామానికి చెందిన సారి మోహన్, సాలూరు మెంటాడ వీధికి చెందిన బెవర గణేష్‌లతో కలిసి మంగళవారం రాత్రి మధు పాన్‌షాపు వద్దకు వచ్చారు. ఈక్రమంలో తన డబ్బులు ఎప్పుడు ఇస్తారని మధు అడిగాడు. దీంతో ఆ నలుగురు మధుతోపాటు అక్కడ ఉన్న సురేష్ అనే వ్యక్తిపై కులం పేరుతో దూషించి, దాడిచేశారు. ఈ దాడిలో మధుకు తలపై, వీపుపై గాయాలయ్యాయి. సురేష్‌కు చెవి, కన్నుపై గాయాలయ్యాయి. వారు స్థానిక చికిత్స నిమిత్తం సీహెచ్‌సీలో చేరారు. మధును అక్కడ నుంచి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

వేపాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాజ్యోషులపాలెం సమీపం మామిడి తోటల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లం ఊటను బుధవారం ధ్వంసం చేసినట్టు కొత్తవలస ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఎస్ఐ నరసింహరాజు తెలిపారు. దాడిలో హెచ్‌సీలు బి.రాముడు, టీపీపీఎస్ ప్రసాద్, పి.వీర్రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారన్నారు.

మద్యం దుకాణంపై కేసు నమోదు

విజయనగరం క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ రూరల్ సర్కిల్ పరిధిలోని గంట్యాడ మండలంలోని నరవ గ్రామంలో ఓ మద్యం దుకాణంపై కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ ఎం.విజయలక్ష్మి ప్రకటనలో తెలిపారు. అలాగే మద్యంతో ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేశామని, వారి నుంచి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

రూ.500కే ఇంజక్షన్

గజపతినగరం జనవరి 22(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పాడి పశువుల అభివృద్ధికి వివిధ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వై.వి.రమణ అన్నారు. బుధవారం పాతబగ్గాంలో పశు వైద్య శిబిరం, లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు ఆర్థిక వనరులు సమకూర్చేలా ఆడ పెయ్యల సంతతి పెంపునకు రాయితీతో కూడిన సెమన్ ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. ఇంజక్షన్ రైతులకు రూ.500కే ఇస్తున్నామన్నారు. అనంతరం పశువులకు ఎద నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీడీ దామోదరావు, ఏడీ చంద్రశేఖర్, సర్పంచ్ లెంక పద్మావతి, మరుపల్లి పశువైద్యాధికారి ఉన్నారు.

సమావేశం నుంచి సభ్యుల వాకౌట్

రేగిడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి:) స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కొద్ది సమయంలో వాయిదా పడింది. కీలకమైన శాఖల అధికారులు లేకుండా సమావేశం నిర్వహించడం ఎందుకని వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవోను నిలదీశారు. 21 శాఖలకు గానూ 19 శాఖల సిబ్బంది కిందస్థాయి సిబ్బంది హాజరుకావడాన్ని గమనించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ టొంకాల అచ్చంనాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం సభ్యులతో వాకౌట్ చేశారు. అధికారులు ఓడీపై విధుల్లో ఉన్నారని, అందుకే సమావేశానికి హాజరు కాలేకపోయారని ఎంపీడీవో శ్యామలకుమరి చెప్పినప్పటికీ వారు పట్టించుకోలేదు. దీంతో ఎంపీడీవో సమావేశం షెడ్యూల్ సమయం వరకూ వేచి చూసి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

పాలవలసకు నివాళి

మాజీ ఎంపీ, డీసీసీబీ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో వైస్ ఎంపీపీలు టొంకాల అచ్చంనాయుడు, వి.జగన్మోహనరావు, ఎంపీడీవో శ్యామలకుమారి, తహసీల్దార్ చిన్నారావు, వివిధ శాఖల ఉద్యోగులు ఉన్నారు.

రూ.2,400 కోట్ల పంట రుణాలు ఇచ్చాం

● వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు

రామభద్రపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది రైతులకు రూ.2400 కోట్ల బ్యాంకు రుణాలు అందించామని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వి.తారకరామారావు తెలిపారు. బుధవారం ఆరికతోట రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌లో మరో రూ.840 కోట్లతో బ్యాంకు ద్వారా రైతులకు రుణాలు అందించనున్నామన్నారు. ఈ ఏడాది 10025 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు గుర్తించామని, దానికోసం రూ.1.40 కోట్లు పంటల బీమా వర్తింపజేయనున్నట్టు తెలిపారు. లక్షా 56 వేల 272 మంది రైతులు బీమా చేసుకున్నారన్నారు. ఈ ఏడాది రైతుల నుంచి 4.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 30 శాతం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఈ ఏడాది జిల్లాలో 16వేల మంది కౌలు రైతులకు రూ.70 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు రూ.6 కోట్లు అందించామన్నారు. దీని కోసం 1600 మంది రైతులను గుర్తించామని తెలిపారు. ●ఇదిలా ఉండగా జిల్లాలో కొత్తగా ఫార్మర్స్ రిజిస్ట్రీ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని జేడీ తారకరామారావు తెలిపారు. ప్రతి రైతుకు ఒక యూనిక్ నెంబరు ఇచ్చి వారికి సంబంధించిన అన్ని విషయాలు నమోదు చేస్తామన్నారు. వీఆర్వోలు, వీఏఏలు, రైతు సేవా కేంద్రాల ద్వారా అమలు చేయనున్నామని తెలిపారు. అనంతరం బూసాయవలసలో మొక్కజొన్న పంటను పరిశీలించి, పంట దిగుబడులపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.వెంకటయ్య, వీఏఏ పద్మనాభుని కొండలరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.57 లక్షలు

రాజాం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి హుండీల ద్వారా రూ.1,57,097 ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో బీవీ మాధవరావు తెలిపారు. 63 రోజులకు సంబంధించి అమ్మవారికి భక్తులు సమ ర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు.● అలాగే పట్టణంలోని నవదుర్గ అమ్మవారి దేవస్థానంలో హుండీలను ఈనెల 23న గురువారం లెక్కించనున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో హుండీలను తెరిచి లెక్కిస్తామన్నారు.

సోషల్ ఆడిట్‌లో రసాభాస

బొబ్బిలి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వెలుగు ద్వారా డ్వాక్రా మహిళా పొదుపు సంఘాలు పొందిన రుణాలపై కమ్మవలస పంచాయతీ ముత్తావలస గ్రామంలో బుధవారం జరిగిన సోషల్ ఆడిట్ రసాభాసగా సాగింది. ఒకరి పేరున రుణాలు మంజూరు చేసి వేరొకరికి ఇచ్చారంటూ పొదుపు సంఘాల సభ్యులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. 2022-23 సంవత్సరంలో ఈ అవకతవకలు జరిగినా ఇంతవరకూ బయటకు చెప్పకుండా రహస్యంగా ఉంచారంటూ వీవోఏ సీతాదేవిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి, సీసీలు కోటేశ్వరరావు, కృష్ణ జోక్యం చేసుకుని ఆడిట్‌లో అవకతవకలు జరిగినట్టు తేలితే జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. ఇంకా మరికొన్ని సంఘాల ఆడిట్ పూర్తి చేస్తామని ఎలాంటి అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పిల్లా వసుంధర కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గొంగాడవలస గ్రామానికి చెందిన గొంగాడ అప్పారావుకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం అందజేశారు. గత కొద్ది కాలంగా అప్పారావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో అతని చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే సిఫారసు మేరకు ప్రభుత్వం సీఎం సహాయనిధి నుంచి రూ.25వేలు మంజూరు చేసింది. స్థానిక కోటలో అప్పారావుకు ఈ చెక్కును అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, ప్రదీప్, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి

రామభద్రపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో ఇళ్ల పన్నుల వసూళ్లపై గ్రామ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో రత్నం సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాన్‌ట్యాక్స్ వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

మక్కువ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ జాతరలో పారిశుధ్య నిర్వహణ సక్రమం చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. శంబర గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో పారిశుధ్య నిర్వహణ సమస్య తలెత్తకూడదన్నారు. ఎప్పటికప్పుడు గ్రామ వీధుల్లో చెత్తాచెదారాన్ని సేకరించి డంపింగ్ యార్డుకి తరలించాలని సూచించారు. ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాలిటీల నుంచి పారిశుధ్య సిబ్బందిని యాత్ర సమయంలో తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. బీఎల్‌పీవో ఎం.నాగభూషణరావు, ఈవోపీఆర్‌డీ టి.దేవకుమార్, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

ఖరాసవలస కేజీబీవీ పరిశీలన

సాలూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం ఖరాసవలస కేజీబీవీ పాఠశాలను సామాజిక ఆడిట్ బృందానికి చెందిన ఎం.నారాయణమూర్తి, బి.శివ బుధవారం పరిశీలించారు. పాఠశాల నిర్వహణను ప్రిన్సిపాల్(ఎస్‌వో) గాదిపల్లి ప్రశాంతి సోషల్ ఆడిట్ బృందానికి వివరించారు. విద్యార్థులకు వసతి, భోజనం, రికార్డులు, క్రీడాపరికరాలు, గ్రంథాలయం, ల్యాబ్ తదితర వాటిని పరిశీలించారు. పాఠశాలల్లో వివిధ అంశాలను ఈ బృందం పరిశీలించింది. సాలూరు పట్టణంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను మరో సోషల్ ఆడిట్ బృందం పరిశీలించింది.

దళితులకు భూపట్టాలు ఇవ్వండి


నినాదాలు చేస్తున్న దళితులు

సాలూరు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఖరాసవలసలో దళితులు సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం ఖరాసవలస పంచాయతీ గుర్రప్పవలస సమీపంలో ఉన్న భూములను వారు చదును చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గత 50 ఏళ్లుగా పది దళిత కుటుంబాలు ఇక్కడి భూములను సాగు చేస్తున్నాయని చెప్పారు. వాటిని కాజేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. దళితులు సాగు చేస్తున్న భూముల్లో వారికే పట్టాలివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోంబార్కి సింహాచలం, బోడియ్య, వీరయ్య సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

మక్కువ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను రాష్ట్ర స్థాయి సామాజిక తనిఖీ బృందం బుధవారం పరిశీలించింది. పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు, రికార్డులు, మౌలిక సదుపా యాలు, లైబ్రరీ, స్పోర్ట్స్ మెటీరియల్, కిచెన్ గార్డెన్లను పరిశీలించారు. విద్యార్థులు విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ బి.రాజు, బీఆర్‌పీలు వెంకటేశ్వర్లు, పోతురాజు, శ్యామలత పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం

వీరఘట్టం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ వేతనదారులకు 100రోజుల పనిదినాలు కల్పించాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక కంప్యూటర్ సెంటర్‌లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. పంట పొలాల్లో నీటి కుంటల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణాలపై చర్చించారు. అనంతరం కిమ్మి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో ఎండీఎంను పరిశీలించారు. ఏపీవో జి.సత్యనారాయణ, ఈసీ వి.కృష్ణప్రసాద్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి

రామభద్రపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గతంలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే పట్టాలు రద్దు చేస్తామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి హెచ్చరించారు. ఎస్.చింతలవలస గ్రామంలో ఇళ్ల స్థలాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకు 71 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదని, ఈ నెలాఖరులోగా నిర్మాణాలు ప్రారంభించకపోతే నోటీసులు ఇచ్చి, పట్టాలు రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పార్వతీపురంటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ జంక్షన్ వద్ద అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవిద్యా ఉపాసకులు డి.మృత్యుంజ య శర్మతో ప్రత్యేకాభిషేకాలు చేశారు.


ఆలయం వద్ద భక్తులు

15 ఏళ్లుగా ఇంతే..

- అసంపూర్తిగా వీరఘట్టం ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గది
- రెండు గదుల్లోనే తరగతుల నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

వీరఘట్టం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వీరఘట్టం బీసీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు 15 ఏళ్ల కిందట ప్రారంభించిన అదనపు తరగతి గది నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 122 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి రెండు గదుల్లోనే తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి దాతలు ముందుకు వచ్చి, అసంపూర్తిగా ఉన్న తరగతి గదిలోనే గచ్చులను వేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు తరగతి గది నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చందాలతో గచ్చులు వేశాం

పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చందాలు పోగు చేసి అసంపూర్తిగా ఉన్న తరగతి గదిలోనే గచ్చులు వేసి, తరగతులు నిర్వహిస్తున్నాం.

\- గులిపిల్లి మోహన్‌రావు, హెచ్ఎం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

పాఠశాల అదనపు తరగతి గది నిర్మాణం అసంపూర్తి గా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తాం.

\- ఆనందరావు, ఎంఈవో, వీరఘట్టం


అసంపూర్తిగా ఉన్న తరగతి గది

ప్రమాదాలను నివారించాలి

పాలకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలంలో ఉన్న ఆడలి వ్యూ పాయింట్ వద్ద ప్రమాదాలను నివారించాలని కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం, పాలకొండ ఇన్‌చార్జిలు బత్తిన మోహన్, సవర చంటిబాబు, సీనియర్ నాయకుడు బిడ్డిక శ్రీనివాసరావు కోరారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. తరచూ ఆడలి వ్యూపాయింట్‌లో జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ గోడ నిర్మించి రహదారులను విస్తరించాలన్నారు. ఎత్తుగా ఉండే రహదారిని సమాంతరం చేస్తే ప్రమాదాలు అడ్డుకోవచ్చునన్నారు. మరణించిన వ్యక్తుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సీతంపేటలో ఆధార్ శిబిరాలు

సీతంపేట రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలంలో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో గీతాంజలి తెలిపారు. మండ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. హౌస్‌హోల్డ్ వివరాల జాబితాలో పేర్లు లేని వారు తప్పనిసరిగా సచివాలయానికి వెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ ఆధార్ శిబిరాలు సీతంపేట, మండ, పులిపుట్టి, పెద్దపొల్ల, కుడ్డపల్లి, పెదరామ పంచాయతీల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని ఆమె తెలిపారు. సెక్రటరీ ఉమామహేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ సంధ్య తదితరులు ఉన్నారు.

గణతంత్ర పరేడ్‌కు రామవరం సర్పంచ్

సీతానగరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఈనెల 26న గణతంత్ర దినోత్సవ పరేడ్‌ను సతీసమేతంగా వీక్షించడానికి ప్రత్యేక అతిథులుగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి సీతానగరం మండలం రామవరం సర్పంచ్ పెంట సత్యంనాయుడు దంపతులకు ఆహ్వానం అందింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం పది కేంద్ర ప్రభుత్వ పథకాలలో కనీసం ఆరు పథకాలను వారి గ్రామాల్లో వంద శాతం సమర్థవంతంగా నిర్వహిస్తున్న సర్పంచ్‌లలో రాష్ట్ర వ్యాప్తంగా 25 మందిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు.

వెంకటరాయుని కోనేరును అభివృద్ధి చేస్తాం

పాలకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలోని వెంకటరాయుని కోనేరుకు అభివృద్ధి చేస్తానని సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ హామీ ఇచ్చారు. వెంకటరాయుని కోనేరును ఆయన బుధవారం పరిశీలించారు. కోనేరు చుట్టుపక్కల వాల్, బోటు షికారు ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని పంచాయతీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు ఇటీవల కన్నుమూసిన మాజీ రాజ్యసభ సభ్యుడు పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

కలిసికట్టుగా పనిచేద్దాం


ఎమ్మెల్యేని సన్మానిస్తున్న సుడా చైర్మన్ రవికుమార్

పాలకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పట్టణం సుందరీకరణకు నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలని సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్‌కు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అర్బన్ డెవలప్‌మెంట్ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే జయకృష్ణను రవి కుమార్ సన్మానించారు. పాలకొండ పట్టణ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామన్నారు.

మానవ తప్పిదాలతో రోడ్డు ప్రమాదాలు

సాలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని సాలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డుపై ప్రయాణం చేసే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు రక్షించిన వారికి ప్రభుత్వం రూ.25వేలు వరకు నగదు పురస్కారం అందజేస్తుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ఉషశ్రీ, పట్టణ సీఐ అప్పలనాయుడు, ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

పార్వతీపురంటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నేరాల నియంత్రణకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రధాన రహదారితో పాటు పలు కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని సీఐ మురళీ ధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద గల సీసీ కెమెరాలకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జిల్లా కేంద్రంతో పాటు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. షాపుల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పా టు చేసుకోవాలని సూచించామని చెప్పారు. తీర్థ యాత్రలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే ముందుగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తే తగిన రక్షణ కల్పిస్తామని తెలిపారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ


చిన్నారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం, జనవరి22(ఆంధ్రజ్యోతి): కురుపాంలో అతిసారం బారిన పడిన వారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం రాత్రి పరామర్శించారు. గాంధీనగర్, గౌడు వీధులను సందర్శించారు. ఈసందర్భంగా కాలువల్లో ఉన్న పైపులను పరిశీలించారు. వెంటనే వాటిని తొలగించి, మరమ్మతులు చేసి, నీరు సరఫరా చేయాలని డీఈఈ కె.నాగేశ్వరరావు, జేఈ వేణుగోపాల్‌ను ఆదేశించారు. అతిసారం వ్యాధి బారిన చిన్నారులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గాంధీనగర్‌లో నిర్వహిస్తున్న వైద్య శిబిరం పరిశీలించి, వైద్యుడు శంకరరావును కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అతిసారం అదుపులో ఉందని, గ్రామంలో సర్వే నిర్వహిస్తున్నమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కేవీ కొండయ్య, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● గుమ్మలక్ష్మీపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వ కోల్పోయిన బాధితులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం పరామర్శించారు. బాధితులకు నిత్యావసర సరుకులను అందజేశారు. తహసీల్దార్ శివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పాడి సుదర్శనరావు, పార్టీ నాయకులు పద్మావతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

బెలగాం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు బకాయి ఉన్న సుమారు రూ.20 వేల కోట్లు చెల్లించేందుకు రోడ్డు మ్యాప్ ఇవ్వాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో కె.హేమలతకు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు జూలై 2023 నుంచి అమలు కావల్సిన 12వ పీఆర్సీ కోసం పీఆర్సీ కమిషనర్ నియామకం పునరుద్ధరించాలని కోరారు. వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ, పీఆర్సీ బకాయిలు సుమారు రూ.20వేల కోట్లు విడుదలకు తగిన రోడ్డు మ్యాప్ ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కుర్రా భాస్కరరావు, నాయకులు వి.జ్యోతి, ఎన్.శ్రీనివాసరావు, పి.వెంకటనాయుడు పాల్గొన్నారు.

కొత్త పనులు ఇవ్వండి


వేతనదారులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో ఉపాధి వేతనదారులకు కొత్త పనులు ఇవ్వాలని, అలాగే పాత మేట్లను కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తుంబలి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.మోహన్‌రావు, జి.శ్రీనివాసరావు, ఉపాధి వేతనదారులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పనులు పూర్తయి రెండు నెలలుగా కావస్తోందని, పనులు లేక వేతనదారులు వలసలు వెళ్లిపోతున్నారన్నారు. జిల్లాలో పనులు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదని, వెంటనే దళితులకు, గిరిజనులకు, పేదలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా ఉపాధి మేట్లను మారుస్తున్నారని, కూటమి ప్రభుత్వం కూడా అలాగే చేస్తోందని ఆయన విమర్శించారు. రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెంట్లు, మెడికల్ కిట్లు, వేసవి అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సర్వేలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న జిల్లా పోగ్రాం అధికారి జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కుష్ఠు, ఎన్సీడీ తదితర సర్వేలపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా పోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని జగన్నాథపురం పీహెచ్‌సీని ఆయన బుధవారం సందర్శించారు. గర్భిణులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై గర్భిణులు, రోగులను ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ప్రసూతి వైద్య నిపుణురాలు నిహారిక, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాక్సిన్ మందుల లభ్యత, కుష్ఠు, ఎన్సీడీ సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. అలాగే పట్టణంలోని 7వ, 8వ వార్డుల్లో జరిగిన సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి


ఓపీ వద్ద గుమికూడిన రోగులు

సీతంపేట రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రికి బుధవారం రోగుల తాకిడి పెరిగింది. వాతా వరణంలో వస్తున్న మార్పుల కారణంగా జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో రోగులు సీతంపేట ఏరియా ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. బుధవారం ఒక్కరోజే ఓపీ 380కి పైగా ఉంది.

అభివృద్ధి పనులకు
ప్రత్యేక నిధులు


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామ దేవత శ్యామలాంబ పండగను దృష్టిలో పెట్టుకుని పలు అభివృద్ధి పనులకుగాను మున్సిపాలిటీకి రూ.కోటి 50 లక్షల ప్రత్యేక నిధులను మంజూరు చేసినట్టు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈసందర్భంగా బుధవారం సాలూరులోని తన నివాసంలో ఆమె మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉన్న సామూహిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీరుకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని అన్నారు. ఈ ప్రత్యేక నిధులతో ప్రజలకు తక్షణం అవసరమయ్యే పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

లోకేశ్ పుట్టినరోజు వేడుకకు హాజరు కావాలి

సాలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం సాలూరులోని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఇంటి వద్ద నుంచి బ్రిడ్జి వరకు బైకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఆమె బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 226 అడుగుల భారీ ఫ్లెక్సీ ఏర్పాటు, అనంతరం కేక్ కటింగ్ ఉంటుందని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆమె కోరారు.

● కురుపాం, జనవరి22(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం కురుపాం టీడీపీ కార్యాలయంలో జరగనున్న వేడుకల్లో పార్టీ నాయకులు పాల్గొనాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సావిత్రమ్మకు అంత్యక్రియలు

గరుగుబిల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, కర్షక మహర్షి ఆసుపత్రి అధినేత ద్వారపురెడ్డి రామ్మోహన్‌రావుల తల్లి సావిత్రమ్మకు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. సావిత్రమ్మ మంగళవారం మృతి చెందారు. స్వగ్రామం కొత్తూరులో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

గ్యాస్ వ్యాన్ బోల్తా

కురుపాం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం నుంచి ఒబ్బంగి వెళ్తున్న గ్యాస్ వ్యాను అదుపుతప్పి లోయలో పడిపోయింది. కాకిలి-ఒబ్బంగి మార్గమధ్యంలో బుధవారం జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్జీవో హోం పరిశీలన

సాలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థను జిల్లా శిశు సంక్షేమ అధికారులు బుధవారం పరిశీలించారు. ఓపెన్ షెల్టర్ పునరుద్ధరణపై ఎన్జీవో ప్రతినిధులతో మాట్లాడారు. ఈసందర్భంగా నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ గత ఐదేళ్లగా ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన వివిధ బకాయిల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ అధికారులు రవికుమార్, సత్యనారాయణ, శ్రీధర్, సీడీపీవో భారతీ పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు నేత్ర పరీక్షలు

సీతంపేట రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్న వారికి సీతంపేట ఏరియా ఆసుపత్రిలో సదరం రీ వెరిఫికేషన్ పరీక్షలు నిర్వహించారు. బుధవారం కంటి సమస్యలతో బాధపడుతూ పింఛన్ తీసుకుంటున్న రోగులకు ఆప్తమాలజిస్టు రేఖ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల పాటు దివ్యాంగ పింఛన్‌దారులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.